సాక్షి
అన్నమయ్య జిల్లా
గురువారం । 18 । జనవరి । 2024



అసైన్‌మెంట్ కమిటీ ద్వారా అర్హులందరికీ భూ పంపిణీ

అసైన్‌మెంట్ కమిటీ ద్వారా అర్హులందరికీ భూపంపిణీ చేస్తామని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ తెలిపారు. -10లో



విద్యార్థుల భవిష్యత్తుకు 'నవోదయ'ం

విద్యార్థులకు ఉత్తమ విద్యా బోధన అందిస్తూ మదనపల్లె సమీపంలోని జవహర్ నవోదయ విద్యాలయం పేరుగాంచింది. -10లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.180	రూ.240
రెండోరకం	రూ.100	రూ.178

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 96 మెట్రిక్ టన్నులు



పులివెందులలోని రాణితోపు



కొప్పర్తిలోని డిక్సన్ పరిశ్రమ



కడపలోని మహావీర్ సర్కిల్



నలుదిశలా ప్రగతి పరుగులు

- జిల్లాలో విశేషాభివృద్ధి
- రిమ్స్‌లో రూ.322.8 కోట్లతో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు
- పులివెందులలో రూ.500 కోట్లతో నూతన మెడికల్ కళాశాల
- బద్వేలు వద్ద రూ.1000 కోట్లతో సెంచురీ ఫ్లైబోర్డ్స్ పరిశ్రమ
- జమ్మలమడుగు నియోజకవర్గంలో రూ.8,800 కోట్లతో జేఎస్‌డబ్ల్యూ ఉక్కు పరిశ్రమ
- రూ.220 కోట్లతో కడప నగర సుందరీకరణ, నూతన రోడ్లు ఏర్పాటు
- కొప్పర్తిలో రూ.127 కోట్లతో ఆల్ డిక్సన్ కంపెనీ నిర్మాణం



కడప రిమ్స్‌లోని సూపర్ స్పెషాలిటీ బ్లాక్



సాక్షి ప్రతినిధి, కడప: కడప గడపలో అభివృద్ధి పరుగులు పెడుతోంది. జిల్లాలో విద్య, వైద్యం, మౌలిక వసతులతో పాటు పారిశ్రామిక ప్రగతి వేగంగా రూపుదిద్దుకుంది. ఆల్ డిక్సన్, సెంచురీ ఫ్లైబోర్డ్స్, ఆదిత్యా బిర్లా గార్మెంట్స్ లాంటి సంస్థలు వచ్చి చేరాయి. రాయలసీమ నిరుద్యోగ సమస్యకు ఫుల్ స్టాప్ పడేలా జేఎస్‌డబ్ల్యూ నేతృత్వంలో స్టీల్ ప్లాంట్ పురుడు పోసుకుంది. సూపర్ స్పెషాలిటీ వైద్యం అందుబాటులోకి వచ్చింది. నూతనంగా మరో ప్రభుత్వ మెడికల్ కళాశాల సిద్ధమైంది. పదేళ్ల నిరాదరణకు గురైన వైఎస్సార్ జిల్లా, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కార్‌లో నలుదిశలా వృద్ధి చెందుతోంది.

కొప్పర్తి పారిశ్రామికవాడ 2014–19 టీడీపీ సర్కార్‌లో నిరాదరణకు గురైంది. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనాపగ్గాలు చేపట్టాక ఈ సెజ్‌పై ప్రత్యేక చొరవ పెట్టారు. 801 ఎకరాల్లో వైఎస్సార్ ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చర్ క్లస్టర్ ఏర్పాటు చేశారు. రూ.10వేల కోట్ల పెట్టుబడులు సమీకరించి లక్ష ఉద్యోగాలు సృష్టించేందుకు ప్రణాళికలు రచించారు. అందులో భాగంగా వేగంగా అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే రూ.80 కోట్లతో ఏర్పాటు చేసిన ఆల్ డిక్సన్ కంపెనీ (ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల సంస్థ) ప్రారంభమైంది. ఈ సంస్థలో 1100 మంది యువతకు ప్రత్యక్ష ఉద్యోగాలు లభించాయి. మరో రూ.127 కోట్లతో 1800 మందికి ఉపాధి లభించేలా విస్తరణ చేపట్టారు. రూ.50 కోట్లతో నిర్మించిన డీజీజీ ఎక్స్‌పోర్ట్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ ద్వారా మరో 2100 మందికి ఉద్యోగాలు లభించాయి. పారిశ్రామికవృద్ధి సాధిస్తేనే యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయనే దృక్పథంతో కొప్పర్తి పారిశ్రామికవాడను తీర్చిదిద్దుతున్నారు. ఇంకోవైపు విద్యా సంస్థల రూపురేఖలు మార్చారు. నాడు–నేడు పథకంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 718 ప్రభుత్వ పాఠశాలలు మౌలిక వసతులతో సరికొత్త భవనాలతో కొత్తరూపు సంతరించుకున్నాయి.

నియోజకవర్గం	డీబీటీ (రూ.కోట్లలో)	నాన్ డీబీటీ (రూ.కోట్లలో)	మొత్తం (రూ.కోట్లలో)
బద్వేలు	1268.73	378.12	1646.85
ప్రొద్దుటూరు	1135.46	680.99	1816.45
కమలాపురం	1115.20	261.64	1376.84
మైదుకూరు	1285.28	334.10	1619.38
కడప	1063.37	753.70	1817.07
జమ్మలమడుగు	1492.78	388.86	1881.64
పులివెందుల	1496.59	481.69	1978.28

రూ.120.34 కోట్లతో తొలి విడత పనులు పూర్తి అయ్యాయి. రెండోవిడతలో మరో 1005 విద్యా సంస్థలు రూ.289.56 కోట్లతో ఆధునికీకరిస్తున్నారు.

ప్రొద్దుటూరు అభివృద్ధికి రూ.515 కోట్లు మంజూరు

వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 2019 డిసెంబర్, 23న రూ.515 కోట్లతో పలు అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. రాయలసీమలో అతి పెద్ద కూరగాయల మార్కెట్ ఏర్పాటుకు రూ.50.5 కోట్లతో శ్రీకారం చుట్టారు. రామేశ్వరం వద్ద ఆర్టీపీపీకి వెళ్లే దారిలో పెన్నానదిపై హైలెవెల్ బ్రిడ్జిని మరో రూ.53 కోట్లతో నిర్మిస్తున్నారు. ఆర్టీసీ బస్టాండ్ ఆధునికీకరణ, వైఎస్సార్ ఇంజినీరింగ్ కళాశాల భవనాల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. ప్రొద్దుటూరు పట్టణ ప్రజల దాహార్తి తీర్చేందుకు రూ.150 కోట్లతో నిర్మించిన అమృత్ నీటి పథకాన్ని ప్రారంభించారు. పట్టణంలోని రహదారులు, పార్కుల నిర్మాణాలు కొనసాగించారు.

కనులవిందుగా సుందరీకరణ



కడపలోని కోటిరెడ్డిసర్కిల్

కడప నగరం కనులవిందుగా రూపుదిద్దుకుంది. దశాబ్దాలు తరబడి పెండింగ్‌లో ఉన్న రహదారుల విస్తరణ వేగంగా చేపట్టారు. మరో రూ.120 కోట్లతో నగరంలోని 12 జంక్షన్లను వృద్ధి చేశారు. రూ.6.85 కోట్లతో రాజీవ్‌మార్గ్ రోడ్డు, రాజీవ్ పార్క్ ఆధునికీకరించారు. రూ.69.2 కోట్లతో పాత బళ్లారి రోడ్డు, రూ.100 కోట్లతో దేవుని కడప రోడ్డు విస్తరణ చేపట్టారు. రూ.10 కోట్లతో ఇండస్ట్రియల్ ఎస్టేట్ రోడ్డు నిర్మించారు. వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానాన్ని రంజీ, దేశవాళీ క్రికెట్ మ్యాచ్‌లకు వేదికగా తీర్చిదిద్దారు. రూ.8.27 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో ఫ్లడ్‌లైట్లను ఏర్పాటు చేశారు. వీటితో డే అండ్ నైట్ మ్యాచ్‌ల నిర్వహణతో పాటు, లైవ్ ఇచ్చేందుకు కూడా వీలవుతుంది.

కడప శిగలో మణిహారం

జమ్మలమడుగు సమీపంలో జేఎస్‌డబ్ల్యూ సంస్థచే నిర్మించతలపెట్టిన స్టీల్ ప్లాంట్ కడప శిగలో మణిహారంగా నిలవనుంది. తొలివిడతగా రూ.3,300 కోట్ల వ్యయంతో నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. 2023 ఫిబ్రవరి, 15న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భూమిపూజ చేశారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.720 కోట్లు వెచ్చించి మౌలిక వసతులను సమకూర్చింది. నాలుగులైన్ల రహదారి, రైల్వే కనెక్టివిటీ, నీటి వసతి కోసం పైపు లైన్ ఏర్పాటు, సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు, విద్యుత్ సరఫరా, భవన సముదాయం అందుబాటులోకి తెచ్చారు. విస్తరణ అనంతరం రూ.8800 కోట్లు పెట్టుబడి, 3 మిలియన్ టన్నుల సామర్థ్యంతో 25వేల మందికి ప్రత్యక్ష ఉద్యోగ అవకాశాలు లభించేలా రూపకల్పన చేశారు.

రెండేళ్లలోనే సెంచురీ ఫ్లైబోర్డ్స్ సంస్థ



గోపవరం వద్దగల సెంచురీ ప్యానల్స్ లిమిటెడ్ పరిశ్రమ

బద్వేల్ నియోజకవర్గం గోపవరం సమీపంలో ఏర్పాటు చేసిన సెంచురీ ఫ్లైబోర్డ్స్ పరిశ్రమకు శంకుస్థాపన చేసిన తర్వాత రెండేళ్లలోనే ప్రారంభించారు. 589.23 ఎకరాల్లో రూ.956 కోట్ల అంచనాతో శ్రీకారం చుట్టిన ఆ సంస్థ పెట్టుబడులు రూ.1600 కోట్లకు చేరాయి. 2024 డిసెంబర్ నాటికి ఉత్పత్తి లక్ష్యం కాగా, 2023 డిసెంబర్ నాటి రెండు దశల పనులు కూడా పూర్తి చేశారు. 2021 డిసెంబర్, 23న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేయగా, 2023 డిసెంబర్ 23న ఆయన చేతుల మీదుగానే ప్రారంభించారు. ఈ పరిశ్రమ ద్వారా ఒక్కరు కాదు, ఇద్దరు కాదు.. 2076 మంది స్థానికులకు ప్రత్యక్ష ఉద్యోగావకాశాలు లభించాయి. 2662 ఉద్యోగాలు అవసరమైతే, ప్రభుత్వ నిబంధనల ప్రకారం 75 శాతం స్థానికులకు ఇవ్వాల్సి ఉంది. అయితే ఇప్పటికి 78శాతం ఉద్యోగాలు స్థానికులకు లభించడం విశేషం.

మెడికల్ హబ్‌గా రిమ్స్



రిమ్స్‌లోని క్యాన్సర్ కేర్ సెంటర్

కడప రిమ్స్ వైద్యశాల ప్రాంగణాన్ని ప్రభుత్వం మెడికల్ హబ్‌గా తీర్చిదిద్దింది. రూ.322.82 కోట్లతో మూడు ఆధునాతన వైద్యశాలలను నిర్మించింది. 452 పడకల సూపర్ స్పెషాలిటీ వైద్యశాల, 100 పడకల మానసిక వైద్యశాల, 100 పడకల కేన్సర్ హాస్పిటల్‌ను నెలకొల్పింది. గతంలో దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 180ఎకరాల విస్తీర్ణంలో 'రిమ్స్' వైద్య కళాశాల, దంత వైద్య కళాశాల, నర్సింగ్ కళాశాలలను ఏర్పాటు చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో రూ.322.82 కోట్లు వెచ్చించి, సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులోకి తీసుకువచ్చారు. కార్డియాలజీ, పీడియాట్రిక్, న్యూరాలజీ, ప్లాస్టిక్ సర్జరీ, గ్యాస్ట్రో ఎంటరాలజీ, నెఫ్రాలజీ, యూరాలజీ లాంటి సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు ఇకపై మన కడప రిమ్స్‌లో లభించనున్నాయి. మరోవైపు పుష్పగిరి కంటి ఆస్పత్రి, ఇంకోవైపు డాక్టర్ ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రిని సైతం అందుబాటులోకి వచ్చాయి.

పులివెందులలో వైద్యకళాశాల



పులివెందులలోని మెడికల్ కళాశాల

పులివెందుల కేంద్రంగా రూ.500 కోట్లతో ప్రభుత్వ వైద్య, నర్సింగ్ కళాశాలను నెలకొల్పారు. ప్రారంభోత్సవానికి సన్నాహాలు కొనసాగుతున్నాయి. వ్యవసాయ, ఉద్యాన కళాశాలలు ఇప్పటికే ప్రారంభించారు. రూ.32.82 కోట్లతో స్కిల్ డెవలప్‌మెంట్ ట్రెనింగ్ అకాడమీ ఏర్పాటు చేశారు. రూ.39 కోట్లతో డాక్టర్ వైఎస్సార్ మెమోరియల్ గార్డన్, రూ.69 కోట్లతో ఉలిమెల్ల చెరువు సుందరీకరణ పూర్తి కానున్నాయి. రూ.24కోట్లతో ఆర్టీసీ బస్టాండ్, డిపో ఏర్పాటు చేశారు. భూగర్భ డ్రైనేజీ, రహదారుల విస్తరణ, నూతన రోడ్ల ఏర్పాటు చేపట్టారు. రూ.5.60 కోట్లతో పార్నపల్లె వద్ద చిత్రావతి జలాశయంలో బోటింగ్ సౌకర్యం కల్పించారు. ఆధునాతన పార్కులు, సుందరంగా రహదారులు, రింగ్‌రోడ్ల సర్కిళ్లు తీర్చిదిద్దారు. ఒక్కమాటలో చెప్పాలంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కార్‌లో జిల్లాలో ప్రగతి నలుచెరుగులా విస్తరించిందని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

గడికోట వద్ద హైలెవెల్ బ్రిడ్జి



భూమి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి, విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ జస్టిస్ నాగార్జునరెడ్డి తదితరులు


వీరబల్లె (రాయచోటి టౌన్): గడికోట వద్ద మాండవ్య నదిపై రూ.13.8కోట్లతో హైలెవల్ బ్రిడ్జిని నిర్మించేందుకు రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లిఖార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డిలు విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్, మాజీ హైకోర్టు న్యాయమూర్తి నాగార్జునరెడ్డితో కలిసి బుధవారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వీరబల్లె నుంచి గడికోటకు మాండవ్య నదిపై నుంచే వెళ్లాల్సి ఉందన్నారు. ఎన్నో తరాలుగా వర్షాకాలంలో గడికోట వాసులకు ఇతర గ్రామాలతో సంబంధాలు తెగిపోయేవన్నారు. వీటిని ప్రత్యక్షంగా చూసిన రిటైర్డ్ న్యాయమూర్తి నాగార్జునరెడ్డి చొరవ చూపి అధికారులు, నాయకులతో చర్చించారన్నారు. ఈ నేపథ్యంలోనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి చెప్పడంతో బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేసి వెంటనే పనులు కూడా మొదలుపెట్టాలని సూచించారని ఎమ్మెల్యే చెప్పారు. దీంతో గడికోట వాసుల చిరకాల వాంఛ తీరుతోందన్నారు. ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు గాలివీటి మదన్ రెడ్డి, గాలివీటి వీరనాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో సోషల్ వార్

- నల్లారి కిషోర్, శంకర్ వర్గాల సవాళ్లు
- వేర్వేరు నియోజక'వర్గాల' మధ్య పోస్టుల తూటాలు



నల్లారి కిషోర్



శంకర్

బి.కొత్తకోట: టీడీపీకి చెందిన పీలేరు, తంబళ్లపల్లె నియోజకవర్గ నాయకుల అనుయాయుల పోస్టులతో కొన్నాళ్లుగా సోషల్ మీడియా హోరెత్తుతోంది. 'మా నాయకుడ్నే విమర్శిస్తారా.. మీ నియోజకవర్గానికే (పీలేరు) వచ్చి ఎన్నికల్లో మీ నాయకుడి ఓటమికి చేయాల్సింది చేస్తాం' అంటూ తంబళ్లపల్లెకు చెందిన ఓ మాజీ ఎమ్మెల్యే వర్గీయులు సవాల్ చేస్తే.. 'మా నాయకుడి గురించి విమర్శించే ముందు మీ నియోజకవర్గంలోని నాయకుడి వల్ల పార్టీకి కలిగిన దుస్థితి గురించి అధినేతకు ఫిర్యాదు చేస్తాం' అంటూ పీలేరుకు చెందిన నాయకుడి వర్గీయులు ఎదురుదాడి చేస్తుండటం వల్ల పోస్టుల తూటాలతో సోషల్ మీడియాలో వార్ జోరుగా సాగుతోంది. ఈ మధ్యలో సందట్లో సడేమియా అన్నట్టు ఈసారి తంబళ్లపల్లెకు కాబోయే ఎమ్మెల్యే మా నాయకుడే అంటూ మరో మాజీ ఎమ్మెల్యే అనుచరుల పోస్టులతో వర్గపోరు ముదురుపాకాన పడింది.

వివాదం మొదలైందిలా..

తంబళ్లపల్లె నియోజకవర్గం టీడీపీ టిక్కెట్‌ను ఓ మాజీ ఎమ్మెల్యేకు ఇప్పించేందుకు పీలేరు నేత నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి ప్రయత్నిస్తున్నాడని తెలియడంతో ఈ వివాదం మొదలైంది. తంబళ్లపల్లెకు చెందిన మాజీ ఎమ్మెల్యే శంకర్ తరఫున టీడీపీ మండల కన్వీనర్ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతూ బీసీ నాయకుడిని అణగదొక్కేందుకు కిశోర్‌కుమార్‌రెడ్డి కుట్రపన్నుతున్నారని ఆరోపించారు. ఈ క్రమంలోనే పలు వ్యాఖ్యలు చేశారు.

శంకర్‌పై కిశోర్ వర్గం ఆరోపణలు

'ఐదేళ్లుగా మాజీ ఎమ్మెల్యే శంకర్ ఎక్కడున్నాడు? బెంగళూరులో ఉంటూ తంబళ్లపల్లెకు చెందిన బడుగు వర్గాలు, ప్రజల కోసం పోరాటం చేస్తున్నారా' అని పీలేరు టీడీపీ నేత నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి వర్గీయులు పోస్టులు పెట్టారు. ఒక్కరోజు నియోజకవర్గంలో అడుగుపెడితే ఆరునెలలుగా కనిపించని మీరు (శంకర్), కిశోర్ నాయకత్వం గురించి మాట్లాడొద్దని హెచ్చరించారు. గతంలో మండల కన్వీనర్ చేత మాట్లాడించావ్, బీసీ నాయకుడ్ని అణగదొక్కుతున్నట్టు ఆరోపిస్తున్న శంకర్ ఎంతమంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు న్యాయం చేశారో అడుగుదామా అని సవాల్ విసిరారు. కిశోర్‌పై చేసిన ఆరోపణల గురించి అధిష్టానానికి ఫిర్యాదు చేస్తామంటూ చాలా ఆరోపణలతో పెద్ద పెద్ద పోస్టులు పెట్టారు కిశోర్ వర్గీయులు.

కిశోర్‌పై శంకర్ వర్గం ఫైర్

కిశోర్ వర్గం చేసిన ఆరోపణలపై శంకర్ వర్గం విరుచుకుపడుతోంది. శంకర్ అంటే నల్లారి కిశోర్‌కు చిన్నచూపు ఎందుకు అంటూ మొదలు పెట్టిన పోస్టులో శంకర్ వర్గీయులు చాలా ఆరోపణలు గుప్పించారు. మీ నియోజకవర్గంలో మీకు బీసీ సామాజిక వర్గాల ఓట్లు అవసరం లేదా, 10 ఏళ్లక్రితం పార్టీని వీడి వెళ్లిన ఓ నాయకుడ్ని చంద్రబాబుతో కలిపేందుకు కుట్రలు చేస్తారా అని ఆగ్రహం వ్యక్తం చే శారు. శంకర్‌ను అణగదొక్కాలని చూస్తే కార్యకర్తలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. ఇతరుల నియోజకవర్గాల్లో ఏం అధికారం ఉందని జోక్యం చేసుకుంటున్నారని కిశోర్‌ను నిలదీశారు. తంబళ్లపల్లె రాజకీయాల్లో జోక్యం చేసుకోవడం మానకపోతే మీ నియోజకవర్గం(పీలేరు) రాజకీయాల్లో బీసీ సామాజిక వర్గ ప్రజలతో కలిసి కలగజేసుకుంటామని హెచ్చరించారు.

శంకర్ వర్గంపై మరో వర్గం

ఓవైపు కిశోర్, శంకర్ వర్గాల మధ్య వైరం కొనసాగుతుంటే.. మరోవైపు తంబళ్లపల్లె టీడీపీ టికెట్ మాదే అని శంకర్ వర్గీయులు పెట్టిన పోస్టులపై స్థానికంగా లేని ఓ మాజీ ఎమ్మెల్యే వర్గం పోస్టులు పెట్టింది. జరిగిపోయిన విషయాలపై పోస్టులు పెట్టి ఆనందం పొందండి అంటూ వ్యంగాస్త్రాలను సంధించింది. 2009లో శంకర్ ఏ పార్టీలో ఉన్నాడు, ఇప్పుడు ఏ పార్టీలో ఉన్నాడని ప్రశ్నించారు. టీడీపీ టికెట్ రాదని భయం పట్టుకుందా, పార్టీలోకి రాని వాళ్ల గురించి పదేపదే పోస్టులు పెట్టడం చూస్తుంటే మీలో (శంకర్) భయం మొదలైందని అర్థమవుతోంది అంటూ ఆ మాజీ ఎమ్మెల్యే వర్గీయులు పోస్టులు పెడుతున్నారు. ఇలా ఒకరిపై ఒకరు పెట్టుకుంటున్న పోస్టులతో టీడీపీ వర్గపోరు సోషల్ మీడియాలో హాట్‌టాపిక్‌గా మారింది.

క్లుప్తంగా

వ్యక్తి అదృశ్యం


వెంకటరమణ (ఫైల్)

కలకడ : వ్యక్తి అదృశ్యమైన సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తిప్పేస్వామి తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని నవాబుపేట పంచాయతీ మండెంవారిపల్లెకు చెందిన వెంకటరమణ (61) జీవితంపై విరక్తి చెంది ఇంటినుంచి 16వతేదీ మంగళవారం వెళ్లిపోయినట్లు ఆయన కుమారుడు పాపయ్య బుధవారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు కలకడ పోలీస్ స్టేషన్‌కు కానీ, ఎస్‌ఐ సెల్ నంబర్: 94409 00713కు సమాచారం ఇవ్వాలని కోరారు.

మామిడి చెట్లు నరికివేత


పొలం వద్ద పరిశీలిస్తున్న బాధితురాలు

పీలేరు (రాయచోటి టౌన్) : తమ పొలానికి వేసిన ముళ్ల కంచెను ధ్వంసం చేసి మామిడి చెట్లు నరికేశారని మట్లి గ్రామం పత్తిరాజుగారిపల్లెకు చెందిన చంద్రమ్మ అనే మహిళ వీరబల్లె పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పత్తిరాజుగారి పల్లె సమీపంలో సర్వే నంబర్ 498, 497లో కొంత భూమి ఉంది. ఈ భూమిని చదును చేసి మూడు నెలల క్రితం మామిడి చెట్లు నాటారని తెలిపారు. అయితే మంగళవారం రాత్రి పొలం వద్ద ఎవరూ లేని సమయంలో అదే గ్రామానికి చెందిన సమీప బంధువులు ఐదుగురు వెళ్లి కంచెను పూర్తిగా ధ్వంసం చేయడంతో పాటు మామిడి చెట్లు కూడా నరికేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై పూర్తి స్థాయి విచారణ జరిపించి తమకు న్యాయం చేయాలని కోరారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని కాపాడిన పోలీసులు


వ్యక్తిని బంధువులకు అప్పగిస్తున్న పోలీసులు

నందలూరు(రాజంపేట) : కుటుంబ సమస్యల కారణంగా ఆత్మహత్య చేసుకోవాలనుకున్న వ్యక్తిని పోలీసులు కాపాడారు. వివరాలు ఇలా.. నెల్లూరు జిల్లా నంతసాగరం మండలం గోగులపల్లి గ్రామానికి చెందిన పెనమలూరు రమణయ్య (40) బుధవారం మధ్యాహ్నం సమయంలో నందలూరులోని పోలీస్ స్టేషన్ పక్కన గల తన బంధువుల ఇంటికి వచ్చాడు. ఈ నేపథ్యంలో కుటుంబ సమస్యల కారణంగా చనిపోవాలనుకుని ఇంట్లో ఉన్న పొలాలకు వాడే పురుగుల మందు తీసుకొని వెళ్లిపోయాడు. గమనించిన రమణయ్య భార్య స్థానిక పోలీస్ స్టేషన్‌కు వచ్చి విషయం తెలిపింది. వెంటనే పోలీస్ సిబ్బంది రెండు బృందాలుగా ఏర్పడి ఆ వ్యక్తికోసం గాలింపు చర్యలు చేపట్టారు. రెండు గంటల వ్యవధిలో అతని ఆచూకీ తెలుసుకుని కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీంతో వారు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థుల భవిష్యత్తుకు నవోదయం

- ఈనెల 20న ప్రవేశ పరీక్ష
- 26 పరీక్షా కేంద్రాలు
- సీటు సాధిస్తే ఏడేళ్ల పాటు ఉచిత విద్యాబోధన


మదనపల్లెలోని జవహర్ నవోదయ విద్యాలయం

మదనపల్లె సిటీ : విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతూ .. ఉత్తమ విద్యా బోధన అందిస్తూ మదనపల్లె పట్టణ సమీపంలోని వలసపల్లె వద్ద ఉన్న జవహర్ నవోదయ విద్యాలయం పేరుగాంచింది. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యనందించేందుకు దీనిని స్థాపించారు. 2023–2024 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశానికి 4,789 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరికి ఈనెల 20వతేదీన పరీక్ష నిర్వహించనున్నారు. ఇందు కోసం జిల్లాలో 26 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు హాల్‌టిక్కెట్లను https://cbseitms.rcil. gov.in/ nvs/ Admincard/ Admincard వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

మొత్తం 80 సీట్లు..

నవోదయ విద్యాలయంలో ఆరో తరగతిలో సీటు సాధిస్తే ఏడేళ్ల పాటు ఉచిత విద్య అందుతుంది. వలసపల్లి జవహర్ నవోదయ విద్యాలయంలో 80 సీట్లు అందుబాటులో ఉన్నాయి. బాలికలకు 30 శాతం, ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 7.5 శాతం, దివ్యాంగులకు 3 శాతం సీట్లు కేటాయిస్తున్నారు. మొత్తం 80 సీట్లలో 75 శాతం అంటే 60 సీట్లను గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు, 20 సీట్లు పట్టణ ప్రాంతల విద్యార్థులకు కేటాయిస్తారు.

పరీక్ష విధానం ఇదీ..

నవోదయ పరీక్ష 100 మార్కులకు 80 శాతం ప్రశ్నలు ఉంటాయి. సమయం రెండు గంటలు. దివ్యాంగులకు అదనంగా 40 నిమిషాలు సమయం ఇస్తారు. మేధాశక్తిని పరీక్షించేందుకు 50 మార్కులకు 40 ప్రశ్నలు, గణితంలో ప్రతిభను తెలుసుకునేందుకు 25 మార్కులకు 20 ప్రశ్నలు, భాషా పరిజ్ఞానాన్ని పరీక్షించేందుకు 25 మార్కులకు 20 ప్రశ్నలు ఇస్తారు.

ఆహ్లాదకర వాతావరణం..

నవోదయ విద్యాలయంలో సీబీఎస్‌ఈ సిలబస్‌తో కూడిన అత్యుత్తమ విద్యాబోధన అందిస్తారు. నిపుణులైన అధ్యాపకులు బోధిస్తారు. సువిశాల ప్రాంగణం, ఆహ్లాదకర వాతావరణం, అధునాత కంప్యూటర్ ల్యాబ్, పోషక విలువలతో కూడిన ఆహారం, మానసికోల్లాసానికి క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, యోగా, ఎన్‌సీసీ తదితర అంశాలు నవోదయ విద్యాలయ ప్రత్యేకతలు. సీబీఎస్‌ఈ పరీక్ష ఫలితాల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధిస్తూ నవోదయాలు తమ ప్రత్యేకతను చాటుకుంటున్నాయి.

అత్యుత్తమ ప్రమాణాలు



విద్యాలయంలో అత్యుత్తమ విద్యా ప్రమాణాలు ఉన్నాయి. విద్యార్థుల సర్వోత ముఖాభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. విద్యాలయంలో కెరీర్ గైడెన్స్ సెల్ ఏర్పాటు చేశాం. న్యూట్రీషియన్ ఆధ్వర్యంలో పోషక విలువలతో కూడిన ఆహారం అందిస్తున్నాం. ఇక్కడ చదువుకున్న విద్యార్థులు చాలా మంది ఉన్నత స్థాయిలో ఉన్నారు. – గోవిందరావు, ప్రిన్సిపాల్, నవోదయ విద్యాలయం

ఆన్‌లైన్ షాపింగా.. జరజాగ్రత్త!


ఆన్‌లైన్ షాపింగ్‌లో వచ్చిన చిరిగిపోయిన ప్యాంట్లు


డ్రిల్లింగ్ మిషన్ బదులు వచ్చిన స్పానర్, స్క్రూడ్రైవర్

పీలేరు : ఆకర్షణీయమైన ఆఫర్లు... తక్కువ ధరకే బ్రాండెడ్ వస్తువులంటూ ఆన్‌లైన్‌లో వస్తున్న ప్రకటనలను చూసి ఆన్‌లైన్ షాపింగ్‌కు బాగా అలవాటు పడుతున్న ప్రజలు జరజాగ్రత్తగా ఉండాలి. ఎందుకంటే ఇటీవల ఆన్‌లైన్ షాపింగ్‌లో బుక్ చేస్తున్న వస్తువులకు బదులు ఎందుకూ పనికిరాని వస్తువులు వస్తున్నాయి. వాటిని చూసి వినియోగదారులు ఏమి చేయాలో దిక్కుతెలియని పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. బుధవారం ఒక్కరోజులోనే పీలేరు పట్టణంలో ఓ వినియోగదారుడికి మంచి బ్రాండెడ్ ప్యాంట్లకు బదులు చిరిగిపోయిన, దుర్గంధం వెదజల్లుతున్న పాత ప్యాంట్లు ప్యాకింగ్‌లో వచ్చాయి. అలాగే మరో మహిళకు కొత్తబట్టలకు బదులు చిరిగిపోయిన పాతబట్టలు వచ్చాయి. ఇంకో వినియోగదారుడు రూ. వెయ్యి విలువైన మంచి టార్చ్‌లైట్ బుక్ చేస్తే దానికి బదులు రూ. 10 విలువ చేసే సిజర్‌లైట్ వచ్చింది. మరో వినియోగదారుడు డ్రిల్లింగ్ మిషన్ బుక్ చేస్తే రూ. 100 విలువ చేసే స్పానర్, స్క్రూడ్రైవర్ పంపించారు. డెలివరీ బాయ్స్‌ను ప్రశ్నిస్తే తమకు వచ్చిన పార్సిల్ ఇచ్చేవరకే తమ పని అని తమకు ఎలాంటి సంబంధం లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా ఫేస్‌బుక్, యూట్యూబ్ తదితర యాప్‌లో వచ్చే డూప్లికేట్ కంపెనీల ప్రకటనలు నమ్మి మోసపోరాదని పలువురు సూచిస్తున్నారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీల ఏర్పాట్లకు అంకురార్పణ


కబడ్డీ పోటీల ఏర్పాట్లకు అంకురార్పణ చేస్తున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి

రాజంపేట టౌన్ : పట్టణంలోని ఇన్‌ఫ్యాంట్ జీసెస్ హైస్కూల్‌లో ఈనెల 28వ తేదీ నుంచి ప్రారంభం కానున్న అండర్–14 జాతీయ స్థాయి బాలికల కబడ్డీ పోటీల ఏర్పాట్లకు బుధవారం జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి భూమిపూజ చేశారు. అనంతరం జెడ్పీ చైర్మన్ విలేకరులతో మాట్లాడారు. గతంలో రాజంపేటలో జాతీయ స్థాయిలో జరిగిన వివిధ క్రీడాపోటీలు చిన్నపాటి పొరపాట్లు కూడా లేకుండా విజయవంతం చేశారని, అదే రీతిలో కబడ్డీ పోటీలను కూడా విజయవంతం చేయాలని ఆయన అధికారులకు సూచించారు. పోటీల ప్రారంభానికి కేవలం పదిరోజులు మాత్రమే సమయం ఉన్నందున అధికారులు ఏమాత్రం సమయం వృథా చేయకుండా ముమ్మరంగా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. పోటీల్లో పాల్గొనేందుకు వచ్చే వారంతా బాలికలైనందున వారు సురక్షితమైన ప్రాంతంలో బసచేసే ఏర్పాట్లు చేయాలన్నారు. బాలికలతో పాటు మహిళా క్రీడా అధికారులు కూడా వస్తారని వారికి కూడా వసతి సౌకర్యాలు కల్పించే విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. మ్యాచ్ ముగిసిన తర్వాత క్రీడాకారులు వారు బసచేసే ప్రాంతానికి సురక్షితంగా వెళ్లేందుకు వారి వెంట మహిళా పీఈటీలు కాని, అవసరమైతే మహిళా కానిస్టేబుళ్లను కూడా ఏర్పాటు చేసుకునే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. డిప్యూటీ డీఈఓ వరలక్ష్మి, ఆర్‌ఐపీ, స్కూల్‌గేమ్స్ రాష్ట్ర సెక్రెటరి జి.భానుమూర్తిరాజు, స్కూల్‌గేమ్స్ జిల్లా సెక్రెటరి వసంత, రాజంపేట, నందలూరు, పుల్లంపేట మండలాల ఎంఈఓలు కొండూరు రఘునాథరాజు, సుబ్బరాయుడు, నాగయ్య, జి.చక్రధర్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

అనుమానం.. పెనుభూతమై!

- ప్రేమించి పెళ్లిచేసుకున్న భార్యపై హత్యాయత్నం
- అందరూ చూస్తుండగానే కత్తితో అమానుషంగా దాడి
- దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన స్థానికులు


భర్త దాడిలో గాయపడిన హేమావతి


పోలీసుల అదుపులో నిందితుడు నగేష్

మదనపల్లె : అనుమానం కాస్తా పెనుభూతమై... ప్రేమించి పెళ్లిచేసుకున్న భార్యను అందరూ చూస్తుండగానే కత్తితో అమానుషంగా దాడిచేసి భర్త హత్యాయత్నం చేసిన ఘటన బుధవారం సాయంత్రం మదనపల్లెలో జరిగింది. పుంగనూరు నియోజకవర్గం చౌడేపల్లెకు చెందిన నగేష్, మదనపల్లె పట్టణం బసినికొండకు చెందిన జయమ్మ, రామన్నల మూడో కుమార్తె హేమావతి(27)ని ఎనిమిదేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఆదర్శి, స్వీటీ ఇద్దరు కుమార్తెలు. నగేష్ బేల్దారి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. హేమావతి స్థానికంగా ఉన్న ప్రసాద్ ఈఎన్‌టీ ఆస్పత్రిలో మూడేళ్లుగా నర్సుగా పని చేస్తోంది. ఈ క్రమంలో భర్త నగేష్ హేమావతిపై అనుమానం పెంచుకున్నాడు. విధి నిర్వహణలో భాగంగా ఆమె ఎవరితోనన్నా ఫోన్‌లో మాట్లాడినా, ఎక్కడికైనా వెళ్లినా అనుమానం, సూటిపోటిమాటలతో వేధించేవాడు. జీవనోపాధిగా ఉన్న బేల్దారి పని మానేసి, దుర్వ్యసనాలకు అలవాటుపడి జులాయిగా మారి భార్య సంపాదనపై ఆధారపడేవాడు. దీంతో భార్యాభర్తల మధ్య విభేదాలు మొదలై పెద్దమనుషుల పంచాయతీ వరకు వెళ్లింది. బసినికొండలో కాపురం ఉంటున్న నగేష్, హేమావతి దంపతులను పెద్దమనుషులు భర్త స్వగ్రామమైన చౌడేపల్లెకు మకాం మార్చేలా ఒప్పించి భార్య హేమావతిని కాపురానికి పంపించారు. నెలరోజులుగా హేమావతి రోజు చౌడేపల్లె నుంచి మదనపల్లెకు వచ్చి ఆస్పత్రిలో పనిచేస్తూ సాయంత్రం ఇంటికి వెళుతుండేది. బుధవారం సాయంత్రం విధులు ముగించుకుని ఇంటికి వెళ్లే సమయంలో భర్త నగేష్ ఆస్పత్రి వద్దకు చేరుకుని భార్యతో వేరే వ్యక్తికి మెసేజ్‌లు చేసి ఎందుకు మాట్లాడావంటూ గొడవ పడ్డాడు. భార్య నచ్చజెప్పేందుకు ప్రయత్నించినప్పటికీ ఏమాత్రం లెక్కపెట్టకుండా ఆమెను తీవ్రంగా కొడుతూ, ముందుగానే తెచ్చుకున్న మచ్చుకత్తితో ఆమెపై దాడికి పాల్పడ్డాడు. మెడ, తల, చేతిపై విచక్షణారహితంగా దాడిచేశాడు. దీన్ని ఆస్పత్రికి వచ్చిన వారు, స్థానికులు గమనించి, అక్కడికక్కడే నిందితున్ని నిలువరించి, దేహశుద్ధి చేశారు. హేమావతి పనిచేస్తున్న ఆస్పత్రి సిబ్బంది, స్థానికులు పోలీసులకు సమాచారం అందించి 108 అంబులెన్స్‌లో బాధితురాలిని జిల్లా ఆస్పత్రికి తరలించారు. టూటౌన్ ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య ఘటనాస్థలానికి చేరుకుని నిందితుడు నగేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. భార్యను కత్తితో నరికేటప్పుడు ప్రతిఘటించే సమయంలో భర్త నగేష్‌కు స్వల్పగాయాలవడంతో అతడికి జిల్లా ఆస్పత్రిలో చికిత్సచేయించి స్టేషన్‌కు తరలించారు. హేమావతి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నవశకం

అమ్మ ఒడితో బిడ్డను చదివించుకుంటున్నా



నిరుపేదలమైన మేము గతంలో బిడ్డను చదివించుకోవాలంటే చాలా ఇబ్బందులు ఎదుర్కొనేవాళ్లం. జగనన్న ముఖ్యమంత్రి అయిన తర్వాత అమ్మ ఒడి పథకంతో మూడేళ్లుగా డబ్బులు మా ఖాతాకు జమ అవుతున్నాయి. మూడో తరగతి చదువుతున్న నా కుమార్తె గీతశ్రీని స్థానిక ఇందిరమ్మ కాలనీలోని ప్రాథమిక పాఠశాలకు పంపిస్తున్నా. పుస్తకాలు, యూనిఫాం దుస్తులు ఉచితంగా అందజేశారు. అమ్మ ఒడి పథకంతో మమ్మల్ని ఆదుకున్న సీఎంకు రుణపడి ఉంటాం. – ఎం. కుసుమ, ఇందిరమ్మ కాలనీ, పీలేరు.

జగనన్న సురక్ష ద్వారా కుల ధ్రువీకరణ పత్రం



నాలుగు నెలల క్రితం మా ఊర్లోని గ్రామ సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమం మీటింగ్ పెట్టారు. ఈ మీటింగ్‌లో క్యాస్ట్ సర్టిఫికెట్ ఇచ్చారు. మా ఇంటికి వలంటీరు వచ్చి నా ఆధార్ కార్డు చూసి వైఎస్సార్ చేయూత పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు క్యాస్ట్ సర్టిఫికెట్ కావాలని చెప్పారు. ఎలాంటి డబ్బులు తీసుకోకుండా సచివాలయం వద్ద ఉచితంగా సర్టిఫికెట్ ఇచ్చారు. దీంతో చేయూత పథకానికి దరఖాస్తు చేసుకున్నాను. – శ్రీపతి వరకుమారి, అన్నవరం, చాపాడు మండలం

సొంతింటి కల సాకారమైంది



పన్నెండు ఏళ్ల క్రితం భర్త చనిపోయాడు. కూలి పని జీవనాధారం. సొంతిల్లు కట్టుకునే స్తోమత లేదు. కూలి చేస్తే వచ్చే డబ్బులతో పొట్ట నింపుకోవడంతో పాటు ఒక్కగానొక్క కూతురి వివాహం జరిపించాను. దీంతో సొంతింటికల కలగానే మిగిలిపోయింది. మా గ్రామం యర్రగుంట్లపల్లె కురవపల్లెలో మాకున్న పాత ఇల్లు వర్షం వస్తే పూర్తిగా తడిసిపోయేది. గత ప్రభుత్వంలో ఇంటి కోసం అర్జీ పెట్టుకున్నా ఎవరూ పట్టించుకోలేదు. వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక పేదలందరికీ ఇళ్లు ఇస్తున్నారని తెలిసింది. గ్రామ వలంటీరు మా ఇంటికి వచ్చి ఆధార్ కార్డు తీసుకుని ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయించారు. అనుకున్నట్లే ఇల్లు మంజూరైంది. ఎట్టకేలకు జగనన్న పుణ్యమా అని సొంతింటి కల సాకారమైంది. జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం. – ఆనందమ్మ, కురవపల్లె, యర్రగుంట్లపల్లె, పీలేరు, అన్నమయ్య జిల్లా

మిద్దెపై నుంచి పడి మహిళకు తీవ్రగాయాలు


గాయపడిన రేణుకమ్మ

మదనపల్లె : భవన నిర్మాణ పనులు చేస్తున్న ఓ మహిళ ప్రమాదవశాత్తు మిద్దె మెట్లపై నుంచి జారి కిందపడి తీవ్రంగా గాయపడిన ఘటన పట్టణంలో జరిగింది. టూటౌన్ పోలీసులు, బాధితురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక బీకే పల్లెలో కాపురం ఉంటున్న మల్లికార్జున భార్య రేణుకమ్మ తమ నూతన ఇంటి నిర్మాణ పనుల్లో పనిచేస్తూ, మధ్యాహ్నం మెట్లు దిగే సమయంలో ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడి తీవ్రంగా గాయపడింది. అపస్మారక స్థితికి చేరుకున్న ఆమెను సహచరుల సాయంతో కుటుంబీకులు వెంటనే జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం తిరుపతి రుయాకు వైద్యులు రెఫర్ చేశారు. ఘటనపై టూటౌన్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు.

విద్యుత్ షాక్‌తో..


తీవ్రంగా గాయపడిన హరీష్

పీలేరురూరల్ : విద్యుత్ షాక్‌తో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని తలపులలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. తలపుల సబ్‌స్టేషన్‌లో జేఎల్‌ఎం గ్రేడ్–2 గ్రామ సచివాలయ ఉద్యోగి కె. హరీష్ (27) , డిపార్ట్‌మెంట్ ఫీల్డ్ అసిస్టెంట్ ఆర్. మునిప్రసాద్ (25) ఇరువురు బుధవారం ఎల్‌సీ తీసుకుని అప్పిరెడ్డిగారిపల్లె, మల్లేశ్వరపురం విద్యుత్ మరమ్మతు పనులు చేస్తున్నారు. ఇదే సమయంలో విధి నిర్వహణలో ఉన్న డ్యూటీ ఆపరేటర్ బాలాజి మద్యం మత్తులో ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా విద్యుత్ సరఫరా ఇచ్చేశాడు. దీంతో ఒక్కసారిగా విద్యుత్ షాక్‌కు గురైన హరీష్, మునిప్రసాద్ తీవ్రంగా గాయపడి కిందపడ్డారు. సమాచారం తెలుసుకున్న ట్రాన్స్‌కో ఈఈ మునిచందర్ సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువురిని హుటాహుటిన ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. హరీష్ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం వేలూరు సీఎంసీకి తరలించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన బాలాజిని సస్పెండ్ చేశారు.

ట్రాక్టర్‌ను బైక్ ఢీకొని..


ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శ్రీనివాసులు

మదనపల్లె : రోడ్డు పక్కన నిలిపిన ట్రాక్టర్‌ను వెనుక వైపు నుంచి బైక్ ఢీకొనడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడి, మరో వ్యక్తికి స్వల్పగాయాలైన ఘటన శనివారం జరిగింది. పట్టణంలోని ఎగువ కురవంకలో నివాసం ఉంటున్న నడిపి రెడ్డెప్ప కుమారుడు శ్రీనివాసులు(53), కుమారుడు బిపిన్(20)తో కలిసి వ్యక్తిగత పనులపై బైక్‌లో తిరుపతికి వెళ్లారు. పని ముగించుకుని తిరిగి మదనపల్లెకు వస్తున్న క్రమంలో మండలంలోని చిన్నతిప్పసముద్రం వద్ద రోడ్డుపక్కన నిలబెట్టిన ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొన్నారు. శ్రీనివాసులు పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతికి రెఫర్ చేశారు. తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అసైన్‌మెంట్ కమిటీ ద్వారా అర్హులందరికీ భూ పంపిణీ

జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్


అసైన్‌మెంట్ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, శాసనమండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకియాఖానం, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

రాయచోటి : అసైన్‌మెంట్ కమిటీ ద్వారా అర్హులందరికీ భూపంపిణీ చేస్తామని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి తన క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అర్హులైన పేదలకు రెండవ విడత భూపంపిణీ చేసేందుకు అసైన్‌మెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ గిరీషా పీఎస్, ఎమ్మెల్యే జి.శ్రీకాంత్‌రెడ్డి, శాసనమండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకియాఖానం, జాయింట్ కలెక్టర్ ఫర్మా అహ్మద్‌ఖాన్, రాయచోటి, రాజంపేట ఆర్డీఓలు రంగస్వామి, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో జెడొహెచ్‌డీసీ భూములకు సంబంధించి నందలూరు మండలంలో 48 మందికి 67.51 ఎకరాలు, ఓబులవారిపల్లె మండలంలో 76 మందికి 115.61 ఎకరాలు, రైల్వేకోడూరు మండలంలో 41 మందికి 41.00 ఎకరాలు, చిట్వేలి మండలంలో 140 మందికి 337.28 ఎకరాలు, సంబేపల్లె మండలంలో 212 మందికి 217.74 ఎకరాలు, ఓబులవారిపల్లె మండలంలో 159 మందికి 235.83 ఎకరాలు మొత్తం 674 మందికి 1014.97 ఎకరాలు డీకేటీ పట్టాలు పంపిణీ చేసేందుకు ఆమోదం తెలిపామన్నారు. అలాగే అసైన్‌మెంట్ భూములు రెండవ విడతలో భూమిలేని రాయచోటి నియోజకవర్గంలోని చిన్నమండెం మండలంలో 255 మందికి 316.52 ఎకరాలు, గాలివీడు మండలంలో 559 మందికి 773.05 ఎకరాలు, లక్కిరెడ్డిపల్లి మండలంలో 264 మందికి 461.24 ఎకరాలు, రామాపురం మండంలో 39 మందికి 64.91 ఎకరాలు, రాయచోటి మండలంలో 161 మందికి 236.76 ఎకరాలు, రాయచోటి మండలంలో 161 మందికి 236.76 ఎకరాలు, సంబేపల్లి మండలంలో 215 మందికి 268.78 ఎకరాలు మొత్తం 1531 మందికి 2197.72 ఎకరాలు, రైల్వేకోడూరు నియోజకవర్గంలోని పెనగలూరు మండలంలో 100 మందికి 191.74 ఎకరాలు, చిట్వేలి మండలంలో 109 మందికి 136.37 ఎకరాలు, పుల్లంపేట మండలంలో ఇద్దరికి 3.38 ఎకరాలు మొత్తం 211 మందికి 331.49 ఎకరాలు భూపంపిణీ చేస్తామన్నారు. పీలేరు నియోజకవర్గంలోని కేవీ పల్లి మండలంలో ఒకరికి 2.45 ఎకరాలు చొప్పున మొత్తం 1743 మందికి 2531.66 ఎకరాల భూపంపిణీ చేస్తామని తెలిపారు. శాసనసభ వ్యవహారాల సమన్వయకర్త, రాయచోటి ఎమ్మెల్యే జి.శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ పేదల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని పరంబోకు భూములు, వాగులు, వంకలు కాకుండా వ్యవసాయానికి యోగ్యవంతమైన భూములు పేదలకు పంపిణీ చేసేందుకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆమోదం తెలిపారన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాల కల్పన

జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో త్వరితగతిన కనీస సౌకర్యాలను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్సు హాల్ నుంచి ఆయన జిల్లాలోని పోలింగ్ కేంద్రాలలో కనీస సౌకర్యాలపై తహసీల్దార్లు, ఎంపీడీఓలతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో మొత్తం 1607 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, ఈనెల 26వ తేదీలోపు అన్ని పోలింగ్ కేంద్రాలలో కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. 70 పోలింగ్ కేంద్రాలలో విద్యుత్ సదుపాయం లేదని, వెంటనే వీటికి విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని ఏపీఎస్పీడీసీఎల్ అధికారులకు సూచించారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఆర్డీఓలు రంగస్వామి, మురళీ, రామకృష్ణారెడ్డి, డీఈఓ పురుషోత్తం, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

తారురోడ్డు నిర్మాణంతో మరింత సౌకర్యం

తారు రోడ్డు నిర్మాణం పూర్తితో వైఎస్సార్ క్రికెట్ స్టేడియం, ఎంఐజీ లేఅవుట్లను మరింత శోభాయమానంగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి, జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్‌లు అభిప్రాయపడ్డారు. రాయచోటి సమీపంలోని నక్కావాండ్లపల్లెలో నిర్మాణాన్ని పూర్తిచేసుకున్న వైఎస్సార్ క్రికెట్ స్టేడియంకు దిగువ అబ్బవరం సమీపాన నిర్మాణ దశలో ఉన్న ఎంఐజీ లేఅవుట్లకు ఏర్పాటు చేసిన అప్రోచ్ రోడ్డును ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్‌లు కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎంఐజీ లేఅవుట్‌లో అవసరమైన మౌలిక సదుపాయాలను త్వరగా పూర్తి చేయాలని, లేఅవుట్‌లో నిర్మించుకునే ఇళ్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, మున్సిపల్ కమీషనర్ గంగా ప్రసాద్, కడప అర్బన్ డెవలపమెంట్ అథారిటీ వైస్ చైర్మన్ స్పందన్, ఆర్‌అండ్‌బి అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాలు ఢీకొని ముగ్గురికి గాయాలు

మదనపల్లె : రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడిన ఘటన బుధవారం సాయంత్రం పట్టణంలో జరిగింది. కర్ణాటక మంచినీళ్లకుంటకు చెందిన సునీల్(26), రాము(25) మదనపల్లెలో ఫస్ట్‌షో సినిమా చూసేందుకు ద్విచక్రవాహనంలో బయలుదేరారు. నారమాకుల తండాకు చెందిన దొరస్వామినాయక్ ద్విచక్రవాహనంలో నక్కలదిన్నె తండాకు బయలుదేరాడు. ఈ క్రమంలో నక్కలదిన్నె సమీపంలో ఇద్దరి ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో వాహనాల్లో ప్రయాణిస్తున్న ముగ్గురికి తీవ్రగాయాలు కావడంతో స్థానికులు 108 అంబులెన్స్ వాహనాల్లో జిల్లా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.